ప్రజాశక్తి
శనివారం 22 జూన్ 2024 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

ధరల దడ!

- టమోటా కిలో రూ.90
- రైతు బజార్లలో రూ.65
- అన్ని రకాల కూరగాయలూ పెరుగుదల

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కూరగాయల ధరలు గణనీయంగా పెరిగాయి. గత కొన్ని రోజులుగా ఈ పెరుగుదల కొనసాగుతోంది. ప్రధానంగా ఎక్కువగా వినియోగించే టమోటా ధర కిలో రూ.80కి చేరింది. రైతు బజార్లలో రూ.65 వరకు పలుకుతున్నా బహిరంగ మార్కెట్‌లో రూ.80 నుంచి రూ.90 వరకు విక్రయిస్తున్నారు. ఎండల తీవ్రత తగ్గకపోవడం, గత డిసెంబరులో మిచౌంగ్ తుపాను వల్ల కూరగాయల తోటలు దెబ్బతినడంతో దిగుబడి తగ్గింది. జనవరి తరువాత తిరిగి పంటలు వేసినా తగిన వర్షాలు లేకపోవడంతో వివిధ ప్రాంతాల్లో ఆశించిన దిగుబడులు రాలేదు. గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో కూరగాయల సాగు కూడా పెరగడం లేదు. ప్రతి ఏటా సాగు విస్తీర్ణం తగ్గుతోంది. నీటి సరఫరా సక్రమంగా ఉన్న ప్రాంతాల్లో కూడా కూరగాయాల



సాగు గతంలో కంటే గత రెండేళ్లలో తగ్గింది.

ప్రస్తుతం అన్నిరకాల కూరగాయలు కిలో రూ.50కి తగ్గడం లేదు. సాధారణ

రైతు బజార్లలో ఉన్న ధరలు (కిలో)

- టమోటా : రూ.64
- వంకాయ : రూ.40
- బెండ : రూ.34
- మిర్చి రూ.52
- కాకర : రూ.50
- క్యాబేజి రూ.30
- దొండ రూ.36
- బీరకాయలు :40
- బంగాళదుంప రూ.35
- ఉల్లిపాయలు రూ.35
- చామ దుంప : రూ.36
- క్యారెట్‌రూ.36
- కొత్తిమీర కట్ట రూ.50
- ఆకుకూరలు కట్ట రూ.15
- బీన్స్ రూ.160
- క్యాప్సికమ్ రూ.90

మార్కెట్‌లలో దొండ, వంకాయ, బెండ, కాకర, బీర,క్యారెట్, ఇతర దుంపలు తదితర రకాలు కిలో ▶ 2లో



ప్రజల నుండి పాలు సేకరిస్తున్న పాలకేంద్రం నిర్వాహకులు

కల్తీపాల అడ్డాగా తాడేపల్లి

ప్రజాశక్తి-తాడేపల్లి



కలపడానికి సిద్ధంగా ఉంచిన పాలపొడి ప్యాకెట్లు

మార్కెట్‌కు వెళ్లే ఏది కల్తీయో ఏది అసలో తెలియని పరిస్థితి నెలకొంది. తాడేపల్లిలో కల్తీ పాలు తయారవుతున్నాయి. పసి పిల్లలకు వాడే పాలు కూడా కల్తీ కావడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాడేపల్లి బైపాస్- ▶ 2లో



కేంద్ర మంత్రి చంద్రశేఖర్‌కు ఘన స్వాగతం

అన్ని నియోజకవర్గాల నుండి తరలివచ్చిన శ్రేణులతో భారీ ర్యాలీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖల కేంద్ర సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించి తొలిసారిగా గుంటూరు వచ్చిన డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కు శుక్రవారం ఘనస్వాగతం ▶ 2లో

ధరల నియంత్రణకు చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

- రైతు బజార్ల ద్వారా తక్కువ రేట్లకు అందించే ఏర్పాట్లు
- అధికారులతో సమీక్షలో గుంటూరు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-గుంటూరు

వినియోగదారులకు సాధ్యమైనంత తక్కువ ధరలకు అందించేందుకు కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలు నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారితో కలిసి జిల్లా ధరల పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. టమోటా, ఉల్లిపాయలు, ఇతర కూరగాయలు, నిత్యావసరాల సరుకుల లభ్యతతోపాటు ప్రస్తుతం మార్కెట్లో గల ధరలను కలెక్టర్ సమీక్షించి మాట్లాడారు. అధిక ఉష్ణోగ్రతల వల్ల టమోటా పంట దిగుబడులు గణనీయంగా తగ్గడంతో టమోటా ధరలు అధికంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం మార్కెటింగ్ శాఖ ద్వారా ప్రతి జిల్లాకు ఏర్పాటు చేసిన రూ.5.00 లక్షల రివాల్వింగ్ ఫండుతో మార్కెట్ ఇంటర్వెన్షన్ ద్వారా అధిక ధరలు గల కూరగాయలను తక్కువ ధరలకు లభ్యమయ్యే చోట కొనుగోలు చేసి రైతుబజార్ల ద్వారా లాభం నష్టంలేని విధంగా ▶ 2లో

సిఎన్‌జి ఫిల్లింగ్ స్టేషన్‌ను ప్రారంభించిన పల్నాడు కలెక్టర్

రూ.1.50 కోట్లతో రెవిన్యూ ఫిల్లింగ్ స్టేషన్‌లో ఏర్పాటు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



ఫిల్లింగ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్రీకేశ్ బి లత్కర్, జెసి శ్యాంప్రసాద్

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని కలెక్టరేట్‌కు సమీపంలో కొన్ని నెలల క్రితం అందుబాటులోకి వచ్చిన రెవెన్యూ ఫిల్లింగ్ స్టేషన్‌లో పెట్రోల్, డీజిల్‌తో పాటు సిఎన్‌జి అందుబాటులోకి వచ్చింది. రూ.1.50 కోట్లతో ఏర్పాటు చేసిన సిఎన్‌జి ఫిల్లింగ్ స్టేషన్‌ను జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ బి లత్కర్, జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. జిల్లాలో సిఎన్‌జి వాహనాల సంఖ్య, వాటి వివరాలను కలెక్టర్ అడిగారు. సిఎన్‌జి వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని ఆటో డ్రైవర్లకు సూచించారు. తదుపరి ఫిల్లింగ్ స్టేషన్ పాయింట్‌లో ఏర్పాటు చేసిన ఇంజిన్ ఆయిల్ మార్పు కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమములో జిల్లా రెవిన్యూ అధికారి వినాయకం, ఐఒసిఎస్ ప్రతినిధులు శ్రీరాం, శ్రీనివాస పాల్గొన్నారు.

చట్టసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించండి

ఐద్వా పల్నాడు జిల్లా కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - సత్తెనపల్లి

మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు గద్దె ఉమాశ్రీ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక పుతుంబాక భవన్‌లో జరిగిన ఐద్వా పల్నాడు జిల్లా కమిటీ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. లైంగిక దాడులకు గురైన ఘటనల్లో బాధిత మహిళలకు ఎక్స్‌గ్రేషియా విడుదల చేయాలని కోరారు. డ్వాక్రా గ్రూపులు పొదుపును అంతర్గత రుణాలుగా తిప్పుకునేవారు ఇప్పుడు రూ.లక్షలులక్షలు బ్యాంకులలో వుంటున్నాయని, అవసరాలకు ఉపయోగపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అంగన్‌వాడీలు కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ఇటింటికీ తిరిగి మందులు ఆహారం ఇచ్చి ప్రజల ప్రాణాలు కాపాడారని, అయితే వారు అన్ని ప్రభుత్వాల్లోనూ రాజకీయ వేధింపులకు గురవుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. అంగన్వాడీలను రాజకీయ వేధింపుల నుండి కాపాడాలని కోరారు. ఐద్వా జిల్లా కార్యదర్శి జి.రజని మాట్లాడుతూ మహిళలకు, ఆడపిల్లలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. పెన్షన్స్ సచివాలయాల ద్వారా పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో స్పందన, అనూష, సుజాత, ఐ.పద్మ, సావిత్రి, టి.లక్ష్మి పాల్గొన్నారు.



సమావేశంలోమాట్లాడుతున్న గద్దె ఉమాశ్రీ

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - పొన్నూరు

రోటరీ క్లబ్ ఆఫ్ పొన్నూరు, శంకర నేత్రాలయం జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 23న స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు రోటరీ క్లబ్ ఆఫ్ పొన్నూరు అధ్యక్షులు బండారుపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కంటి వైద్య శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి శుక్లాల ఆపరేషన్ నిర్వహిస్తారని తెలిపారు. పొన్నూరు పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కంటి వైద్య శిబిరానికి వచ్చేవారు తమతోపాటు ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, జిరాక్స్ కాపీలను వెంట తీసుకుని రావాలని తెలిపారు.మరిన్ని వివరాలకు 9849220 386, 6302975 214, 855 85 1521 నంబర్లలో సంప్రదించాల్సిందిగా కోరారు.



పాత్రికేయునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల నియోజకవర్గ ఏపీయూడబ్ల్యుజె అధ్యక్షులు కొత్తమాసు శ్రీరామమూర్తి కుమారుడు కొత్తమాసు సృజన్ పుట్టినరోజు వేడుకలు ఆయన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీడబ్ల్యూజే పల్నాడు జిల్లా నాయకులు దాసరి భువనేశ్వరరావు,విద్యాధరణి మురళి, బాలబోయిన పాపారావు, పఠాన్ జాన్ ఖాన్, మాగులూరి రాంబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సృజన్ కేక్ కట్ చేశారు. అనంతరం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పాత్రికేయుడు కొరటా రాంబాబుకు సృజన్ చేతుల మీదుగా పదివేల రూపాయల ఆర్థిక సాయం, ఆరు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను కొత్తమాసు శ్రీరామమూర్తి అందజేశారు.



సత్యసాయి విద్యా విహార్‌లో యోగ దినోత్సవం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల పట్టణంలోని శ్రీ సత్య సాయి విద్యావిహార్ నందు శుక్రవారం యోగ డేను ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థిని విద్యార్థులు యోగాసనాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సత్యసాయి సేవా సమితి కన్వీనర్ జక్కా శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయురాలు వై. రమాదేవి మాట్లాడారు. యోగ ప్రాముఖ్యత గురించి వివరించారు.

మొక్కలు నాటడం పర్యావరణానికి మేలు

ప్రజాశక్తి-పెదనందిపాడు



విరివిగా మొక్కలు నాటడం వలన పర్యావరణానికి మేలు జరుగుతుందని బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ కె.సత్యనారాయణమూర్తి అన్నారు. మండలంలోని నాగులపాడులో శుక్రవారం శ్రీ సుబ్రహ్మణ్యే శ్వర స్వామి వారి దేవాలయాల సముదాయంలో శ్రీశృంగేరి శారదా పీఠాధి పతులు శ్రీ భారతీ తీర్థ మహాస్వామి వారి 50వ సన్యాస స్వీక రణ మహోత్సవం, సువర్ణ భారతీ మహోత్సవం సందర్భంగా అన్ని దేవాలయాల్లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. దేవాలయ పాలక మండలి అధ్యక్షులు జి. సాంబశివరావు, సభ్యులు ఎన్.సింగారావు, పి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మలేరియా రహిత సమాజమే లక్ష్యం

ప్రజాశక్తి-తెనాలి : మలేరియా రహిత సమాజమే లక్ష్యంగా మలేరియా మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా మలేరియా అధికారి టి.మురళీకృష్ణ సుబ్బరాయణం అన్నారు. పట్టణంలో శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే డ్రైడే, మలేరియా మాసోత్సవ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. స్థానిక బీసీ కాలనీ లో నందులపేట వైద్యాధికారిణి డాక్టర్ బీబి జాన్, డాక్టర్ పాల్ రాజ్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థినులతో మలేరియా, ఫైలేరియా యూనిట్ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. **పొన్నూరు:** స్థానిక సాంబశివ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన సభలో జిల్లా మలేరియా అధికారి సుబ్రహ్మణ్యం ప్రసంగించారు.

ల్యాబ్ టెక్నీషియన్లకు శిక్షణ

ప్రజాశక్తి-తెనాలి

తెనాలిలోని పాత ప్రభుత్వ వైద్యశాల ఆవరణలోని అసిస్టెంట్ మలేరియా కార్యాలయంలో శుక్రవారం ల్యాబ్ టెక్నీషియన్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిదిగా జిల్లా మలేరియా అధికారి టి.మురళీకష్ణ సుబ్బరాయణం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగుల నుంచి సేకరించిన రక్త నమూనాల పరిశీలనలో ల్యాబ్ టెక్నీషియన్లు మెలకువలు పాటించాలని సూచించారు.

కేంద్ర మంత్రి చంద్రశేఖర్‌కు ఘన స్వాగతం

(మొదటి పేజీ తరువాయి)

లభించింది. పెదకాకాని రోడ్డు, వై జంక్షన్ నుంచి మొదలైన ర్యాలీకి అన్ని నియోజకవర్గాల నుండి శ్రేణులు భారీగా తరలివచ్చి గజమాలలు, హారతులతో స్వాగతం పలికారు. పెదకాకాని వై జంక్షన్ నుంచి మొదలైన ర్యాలీలో తెలుగు యువత రాష్ట్ర నాయకులు, ఆటోనగర్ అసోసియేషన్, వాసవి హోల్ సేల్ క్లాత్ మర్చంట్ వెల్ఫేర్ అసోసియేషన్‌తో పాటు పలువురు అభిమానులు, కార్యకర్తలు భారీ గజమాలతో ఆహ్వానం పలికారు. ర్యాలీ సాయంత్రం నాలుగు గంటల కల్లా 16వ నంబర్ జాతీయ రహదారి మీదుగా ప్రారంభమైంది. తొలుత ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వద్ద గల టోల్‌ప్లాజా నుంచి టిడిపి నాయకులు ర్యాలీగా రావాలనుకున్నా ప్రజా రవాణా ఇబ్బందులు తలెత్తకూడదనే ఉద్దేశంతో ర్యాలీని వై జంక్షన్ నుంచి ప్రారంభించారు. అక్కడి నుంచి గుంటూరు ఆటోనగర్, ఆర్టీసీ బస్టాండ్, జిన్నా టవర్ సెంటర్, ఏసీ కళాశాల, హిందూ కళాశాల, శంకర్ విలాస్ ఫ్లైఓవర్, అమరావతి రోడ్డులోని చిల్లీస్ రెస్టారెంట్ మీదుగా ఇన్నర్ రింగ్ రోడ్‌లో గల శ్రీ కన్వెన్షన్ వరకు సాగింది. ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, తెనాలి శ్రావణ్ కుమార్, మొహమ్మద్ నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు తో పాటు కాపు నాయకులు ఉగ్గిరాల సీతారామయ్య, ముస్లిమ్ నాయకులు సయ్యద్ ముజీబ్, టిడిపి నాయకులు భీమనాథం భరత్‌రెడ్డి, మైనార్టీ సెల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మద్దిరాల మ్యాని, జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి కె.రజిని, బిజెపి జిల్లా అధ్యక్షులు వనమా నరేంద్ర పాల్గొన్నారు. ఇదిలా ఉండగా చంద్రశేఖర్‌ను పత్తిపాడు మాజీ ఎమ్మెల్యే రావి వెంకటరమణ కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.



చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న రావి వెంకటరమణ

ప్రజాశక్తి - ఎఎన్‌యు

పెమ్మసాని చంద్రశేఖర్‌కు ఆచార్య నాగార్జున యూనివర్శిటీ వద్ద ఘన స్వాగతం లభించింది. గన్నవరం నుంచి గుంటూరు వస్తున్న ఆయనను వర్సిటీ ముఖ ద్వారం వద్ద తెలుగు నాడు స్టూడెంట్ ఫెడరేషన్, తెలుగు నాడు ట్రేడ్ యూనియన్ నాయకులు బొకేలతో, శాలువాలతో శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ ప్రొఫెసర్లు వి.వెంకటేశ్వర్లు, సుబ్బారావు, ప్రొఫెసర్ వి.రవికుమార్, సింహాచలం, రామచంద్రన్, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు హేమంత్, భవ్య, గోపి, హరీష్, రామన్, టిఎన్‌టియుసి అధ్యక్షుడు వి.విష్ణుప్రసాద్, నాయకులు డాక్టర్ ఎం.వెంకటరమణ తదితరులు చంద్రశేఖర్‌ను కలిశారు.

ధరల దడ!

(మొదటి పేజీ తరువాయి)

రూ.50పైనే ఉన్నాయి. రైతు బజార్లలోమాత్రం రూ.35 నుంచి రూ.45 వరకు పలుకుతున్నాయి. ఆకు కూరలన్నీ కట్ట రూ.20 వరకు పలుకుతున్నాయి. టమోటా సబ్సిడీపై కిలో రూ.50కి అందించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు అధికారులు చెబుతున్నా అవి ఇంకా జిల్లాకు పూర్తి స్థాయిలో సరఫరా జరగలేదు. బీన్స్ కిలో రూ.200, క్యాప్సికమ్ కిలో రూ.100 పలుకుతున్నాయి. క్యారెట్ ధర మాత్రం కొంత కాలంగా కిలో రూ.50 నుంచి రూ.60కి విక్రయిస్తున్నారు. రైతు బజార్లలో మాత్రం రూ.45 వరకు విక్రయిస్తున్నారు. కూరగాయలు ధరలు పెరగడంతో హోటళ్లలో భోజనాలు, ఇతర అల్పాహారం ధరలను కూడా పెంచారు.

కూరగాయల ధరల పెరుగుదల అన్ని రకాల తినుబండారాలపై పడుతోంది. పచ్చిమిర్చి కూడా కిలో రూ.60 నుంచిరూ.80 వరకు విక్రయిస్తున్నారు. గతేడాది ఇదే రోజులలో కూరగాయాల ధరల కంటే ఈ ఏడాది ఈ ధరలు 30 నుంచి 40 శాతం వరకు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. గతంలో మిద్దెలపై కూరగాయల సాగును ప్రోత్సహించే వారు. గత ఐదేళ్లలో ఉద్యాన శాఖకు నిధులు రాకపోవడంతో చాలా వరకు ఈ సాగును అధికారులు పట్టించుకోవడం మానేశారు. గ్రామీణ ప్రాంతాల్లోకూడా ఖాళీ స్థలాల్లో



కూరగాయల సాగుకు ప్రజలను అధికారులు ప్రోత్సహించడంలేదు. ఇప్పటికీ చాలా రకాలు ఇతర రాష్ట్రాల నుంచి దిగుబతి చేసుకున్నారు. క్యారెట్, బంగాళ దుంప, క్యాప్సికమ్, బీన్స్ తమిళనాడు, కర్నాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. అలాగే ఉల్లిపాయల ధర ప్రస్తుతం కిలోరూ.40కి చేరింది. రైతు బజార్లలో కిలో రూ.35కి విక్రయిస్తున్నారు.

ధరల నియంత్రణకు చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

వినియోగదారులకు అందిస్తుందన్నారు. టమోటా హోల్‌సేల్ మార్కెట్లున్న చిత్తూరు జిల్లాలోనే కిలో రూ.60 నుండి రూ.88 వరకు ధరలు పలుకుతున్నాయని, అక్కడ కొనుగోలు చేసిన ధరకే రైతుబజార్లలో వినియోగదారులకు అందిస్తామని చెప్పారు. టమోటా ధరలు సాధారణ స్థితికి వచ్చేంత వరకు మార్కటింగ్‌శాఖ అధికారులు రైతుబజార్ల ద్వారా లాభం, నష్టం లేని ధరలకు వినియోగదారులకు అందించాలనని చెప్పారు. జిల్లాలోని అన్ని రైతుబజార్లలోను టమోటాలు వినియోగదారులకు అవసరం మేరకు అందుబాటులో ఉండేలా మార్కెటింగ్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కూరగాయలతో పాటు ఇతర నిత్యావసర సరుకుల ధరలు అసాధరణంగా పెరగకుండా పౌరసరఫరాల అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. నిత్యావసర సరుకులు విక్రయించే దుకాణాల వద్ద ధరల వివరాలు ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కూరగాయలతో పాటు ఇతర నిత్యావసర సరుకులు అక్రమంగా నిల్వ చేయకుండా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. సరుకుల నాణ్యత, తూకం, ధరలను సంబంధిత శాఖలు తనిఖీలు నిర్వహించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేయాలని చెప్పారు. వినియోగదారులకు నాణ్యమైన సరుకులు సరమైన ధరలకు అందించేందుకు వ్యాపార సంఘాల ప్రతినిధులు సహకారం అందించాలన్నారు. సమావేశంలో మార్కెటింగ్ శాఖ ఏడీ రాజబాబు, జిల్లా పౌరసరఫరాల అధికారి కోమలిపద్మ, హార్టీకల్చర్ డీడీ రవీందర్, రైతుబజార్ల ఎస్టేట్ అధికారులు, కమిటీ సభ్యులు చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు ఎ.ఆంజనేయులు, వినియోగదారుల సంక్షేమ సంఘాల ప్రతినిధి డాక్టర్ చదలవాడ హరిబాబు, హోల్‌సేల్, రిటైల్ కూరగాయలు, రైస్, డాల్, అయిల్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కల్తీపాల అడ్డాగా తాడేపల్లి

(మొదటి పేజీ తరువాయి)

రోడ్డులో కల్తీ పాల విక్రయాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. ఇక్కడ పాల కేంద్రం నిర్వాహకులు చుట్టుపక్కల గ్రామాల నుంచి పాలు సేకరిస్తుంటారు. అపార్టుమెంట్లు పెరిగిన తరువాత ఈ ప్రాంతంలో పాలకు ఎక్కువ డిమాండ్ పెరిగింది. దీంతో కొందరు కల్తీ పాలు తయారు చేసి అక్రమ సంపాదనకు తెరలేపారు. గేదె పాలు మాదిరి కనిపించడానికి ఫెవికాల్ వాడి నురుగు తెప్పిస్తున్నారు. ఫేస్, మిల్క్ పౌడర్ కలిపి రెండు లీటర్ల నీళ్ల, రెండు లీటర్ల పాలు కలిపి అమ్మకాలు సాగిస్తున్నారు. దీంట్లో మనిషి ఆరోగ్యానికి హాని కలిగించే హైడ్రోజన్ ఫెరాక్సైడ్ అనే లిక్విడ్‌ను కూడా ఉపయోగిస్తున్నారు. ఈ రకమైన కల్తీపాలు రోజుకు రెండు వేల లీటర్ల వరకు తయారు చేసి కొన్ని నెలలుగా అమ్మకాలు సాగిస్తున్నారు. సంబంధిత అధికారులు తనిఖీలు చేసి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజారోగ్యాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.



మాట్లాడుతున్న వినుకొండ పట్టణ సిఐ సాంబశివరావు

వృద్ధురాలు హత్య కేసు
దుండగుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు

ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక కొత్తపేట 5వ వార్డు ఆరో లైను లో బుధవారం జరిగిన వృద్ధురాలు పయర్ల కోటిరత్నమ్మ హత్య కేసును ఛేదించేందుకు ప్రత్యేక బృందాలతో కలిసి దుండగుల కోసం గాలిస్తున్నామని,నిందితులను త్వరలోనే అరెస్ట్ చేస్తామని పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు అన్నారు. కేసు దర్యాప్తు లో భాగంగా శుక్రవారం మృతురాలి నివాసంలో కుటుంబ సభ్యులతో ఆయన మాట్లాడారు. దుండగుల కోసం పట్టణంలోని అన్ని సిసి ఫుటేజ్‌లను పరిశీలించి ఆధారాలను సేకరిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం అనిల్ అనే బాలుడు చెప్పిన ఆధారాలతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. సాంకేతికతను ఉపయోగించుకొని కేసు దర్యాప్తును ముమ్మరం చేశామన్నారు త్వరలోనే హత్య కేసును ఛేదిస్తామన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యంగా ఒంటరిగా ఇళ్లలో వుండే మహిళలు పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇళ్ల వద్ద ఎవరైనా వ్యక్తులు అనుమానాస్ప దంగా సంచరిస్తుంటే 100 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

కొమ్ములు పెనవేసుకొని గేదె మృతి



ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని కొచ్చర్లలోని పొలంలో మేత కోసం వెళ్లిన రెండు గేదెలు కొమ్ములు పెనవేసుకొని జరిగిన పెనుగు లాటలో కొంత సేపటికి వాటిలో ఒకటి మృతి చెందింది. గమ నించిన గ్రామస్తులు రంపం సాయంతో రెండో గేదె కొమ్మును కట్ చేసి దాని ప్రాణాలను కాపాడారు.మృతి చెందిన గేదె గ్రామానికి చెందిన అయినాల కుమారిది అని గ్రామస్తులు తెలిపారు.

రేషన్ షాపు విషయమై ఇరువర్గాల ఘర్షణ

- ధూళిపాళ్ల పంచాయతిలోని భాగ్యనగర్ కాలనీలో ఘటన
- 8 మందికి గాయాలు



ఘర్షణలో గాయపడిన వాళ్లు..

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

రేషన్ షాపు విషయంలో చోటు చేసుకున్న వివాదం కొట్లాటకు దారితీసింది. ఒకే రాజకీయపార్టీ, ఒకే సామజిక వర్గానికి చెందిన ఇరువర్గాలు ఒకరిపై ఒకరు పరస్పరం రాళ్ళు రువ్వుకున్న సంఘటన సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల పంచాయతి పరిధిలోని భాగ్య నగర్ కాలనీలో గురువారం అర్ధరాత్రి రాత్రి జరి గింది. ఈ ఘటనలో ఇరువర్గాలకు చెందిన 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ పార్టీ నాయకులు రేషన్ షాపుల కోసం పోటీ పడుతున్నారు. ఈ నేపథ్యంలో గాడిదపాటి చిన్నబ్బాయి, రాజేష్, చిలకా వీరయ్య, చిలకా అశోక్ లు పోటీ పడ్డారు. ఈ క్రమంలో ఇరువర్గాలు మధ్య ఘర్షణ జరిగింది. దీంతో ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. ఈ సంఘటన లో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఏరియా ప్రభుత్వ వైద్య శాలకు తరలించారు.నలుగురు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఎస్పీకి ఫిర్యాదు చేసిన అనంతరం బాధిత రైతులు...

మాజీ మంత్రి రజిని, మరిది, పిఎలపై
ఎస్పీకి పసుమర్రు రైతుల ఫిర్యాదు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పేదలకు నివేశన స్థలాలు ఇచ్చే నిమిత్తం జగనన్న కాలనీలకు అవసరమైన 200 ఎకరాల భూములను బలవంతంగా సేకరించడమే కాకుండా మాజీ మంత్రి విడదల రజిని, ఆమె మరిది గోపి, పిఎలు రామకృష్ణ, ఫణి ఎకరాకు రూ.2.50 లక్షల చొప్పున లంచం తీసుకున్నారని చిలకలూరిపేట మండలం పసుమర్రుకు చెందిన పలువురు రైతులు వాపోయారు. ఈ మేరకు పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మల్లికా గర్గ్‌ను శుక్రవారం కలిసి ఫిర్యాదు చేశారు. మంత్రికి, రైతులకు మధ్యవర్తిగా అదే గ్రామానికి చెందిన వైసిపి నేత గోరంట్ల ఉమామహేశ్వరరావు వ్యవ హరించారని, పొలాల వ్యవహారం, లంచం లావాదేవీలపై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. దీనిపై విచారణ జరిపి న్యాయం చేస్తామని రైతు లకు ఎస్పీ హామీ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో వాచ్ మెన్ కు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సైకిల్ ను ఆటో ఢీ కొన్న ఘటనలో వాచ్ మెన్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన సత్తెనపల్లి పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయం సమీపంలో శుక్రవారం రాత్రి జరిగింది. మద్యం మత్తులో ఆటో డ్రైవర్, సైకిల్ ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడ్డిన బాధితుడిని సత్తెనపల్లి ఏరియా వైద్య శాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరు గైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు తాగునీటికి అంతరాయం

ప్రజాశక్తి-తెనాలి

పట్టణ పరిధిలో వివిఎస్సార్ కళాశాల ఫైకస్ పార్కు వద్దగల తాగునీటి ప్రాజెక్టులో నాలుగు పాత ఎయిర్ వాల్స్ మార్పు ప్రక్రియ శనివారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ బి.శేషన్న తెలిపారు. ఫలితంగా గాంధీ ఇర్విన్ పార్కులోని ఇఎల్ఎస్ఆర్ ట్యాంకుల పరిధిలో 3వ వార్డు నుంచి 10 వార్డు వరకు తాగు నీటి సరఫరా ఉండదన్నారు. సిద్దార్ధ కాలని, కవిరాజాపార్కు, నందులపేట, గాంధీనగర్, బిసి కాలని, కొత్తపేట, నాజరుపేట ప్రజలు ఈ విషయమై సహకరించాల్సిందిగా కోరారు.

ఈపూరు యూనియన్ బ్యాంక్ మేనేజర్ బదిలీ

ప్రజాశక్తి-ఈపూరు: మండల కేంద్రమైన ఈపూరులో యూని యన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ గా పనిచేస్తున్న పులి రమేష్ సాధారణ బదిలీలలో భాగంగా తెనాలి మండలం పెరవల్లి శాఖకు బదిలీ అయ్యారు. వినుకొండ శాఖలో పని చేస్తున్న పార్థసారథి ఈపూరు శాఖకు బదిలీ అయ్యారు. బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.



మిర్చి నిల్వలు

బ్యాగులు

మిర్చి దిగుమతి	:	43,236
మిర్చి ఎగుమతి	:	48,825
మిర్చి నిల్వ	:	12,490

మిర్చి ధరలు

రూపాయలలో

334	8,000 - 17,000
నెం.5	10,000 - 15,000
273	9,500 - 16,000
341	8,500 - 16,000
నాన్ ఎసి	
తేజ	7,500 - 20,000
బడిగి	9,000 - 15,500
దేవనూరు డీలక్స్	9,000 - 15,500
తాలుకాయలు	4,500 - 12,500
ఎసి	
334	8,500 -18,000
273	9,500 - 16,000
341	10,000 - 17,000
4884	14,000 -18,000
తేజ	9,500 - 20,000
బడిగి	10,000 - 15,000
దేవనూరు డీలక్స్	11,000 - 13,000
తాలుకాయలు	5,000 -12,000



కేకును కట్ చేస్తున్న కూటమి పార్టీల నాయకులు

మాచర్లలో కూటమి పార్టీల శ్రేణుల సంబరాలు

ప్రజాశక్తి - మాచర్ల

ఎమ్మెల్యేగా జూలకంటి బ్రహ్మారెడ్డి అసెంబ్లీలో ప్రమాణం చేసిన సందర్భంగా పట్టణంలో టిడిపి శ్రేణులు, కూటమి పార్టీల నాయకులు సంబరాలు చేసుకున్నారు. స్థానిక వెంకటేశ్వర థియేటర్ సెంటర్‌లో కూటమి నాయకులు కేక్ కటింగ్ చేశారు. అభిమానులు, కార్యకర్తలు టివీల ముందర కూర్చొని చూసి హర్షధ్వనాలు పలికారు. టిడిపి పట్టణ అధ్యక్షులు కొమెర దుర్గారావు మాట్లాడుతూ ప్రజలు బ్రహ్మారెడ్డికి బ్రహ్మరథం పట్టి భారీ మోజారిటీతో గెలిపించారని, ప్రజల నమ్మకాన్ని ఆయన కాపాడతారని అన్నారు. ప్రజలకు రక్షణగా ఉంటారన్నారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి బండ్ల శ్రీనివాసరావు, తెలుగు యువత రాష్ట్ర నాయకులు కుర్రి శివారెడ్డి, బిజెపి పట్టణ అధ్యక్షులు క్రాంతికుమార్, టిడిపి నాయకులు మాజీ కౌన్సిలర్ మంజుల వెంకటేశ్వర్లు, రెడ్యానాయక్, హనుమంతురావు, దేవళ్ల సదాశివరావు, తురకా సాంబ, జల్లెడ శ్రీనిఖిల్ పాల్గొన్నారు.

బిఎస్ఎన్ఎల్ సేవల విస్తరణకు సహకారం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మాచర్ల : మాచర్ల నియోజకవర్గంలో బిఎస్ఎన్ఎల్ సేవల విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున తమ పూర్తి సహకారం ఉంటుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి బిఎస్ఎన్ఎల్ అధికారులకు స్పష్టం చేశారు. నియోజకవర్గ పరిధిలో పలు ప్రాంతాల్లో బిఎస్ఎన్ఎల్ సేవల విస్తరణకు టవర్స్ ఏర్పాటు కోసం అధికారులు ఎమ్మెల్యేను శుక్రవారం కలిసి చర్చించారు. నాగార్జున సాగర్, విజయపురిసౌత్‌లలో టవర్స్ ఏర్పాటు చేసి మాచర్ల రూరల్‌లో, వెల్దుర్తి మండలం హనుమాపురంతండాలో మరో టవర్ ఏర్పాటుకు, నియోజకవర్గ పరిధిలో మరో 5 టవర్స్ ఏర్పాటు చేస్తే బిఎస్ఎన్ఎల్ సేవలు మాచర్ల నియోజకవర్గంలో చక్కగా ఉంటుందని ఎమ్మెల్యేకు అధికా రులు వివరించారు. ఇందుకు అవసరమైన స్థల సేకరణ, నిర్మాణంలో సహకరించాలని ఎమ్మెల్యేను కోరారు. తమ ప్రభుత్వం సంపూర్ణ సహకారం ఉంటుందని అధికారులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

కొమెరపూడిలో రేపు ఉచిత మెగా సూపర్ స్పెషాలిటీ వైద్యశిబిరం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : మండలంలోని కొమెరపూడిలో గుంటూరు ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ గ్రూప్స్ బిజినెస్ డెవలప్మెంట్ ఆఫీసర్ డాక్టర్ కార్తీక్ చౌదరి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత మెగా వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కొమెరపూడిలో ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు వైద్య శిబిరం జరుగుతుందని, నిష్ణాతులైన సీనియర్ ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు డాక్టర్ గుడారు జగదీష్, సీనియర్ గుండె వైద్య నిపుణురాలు డాక్టర్ హరిత, ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ అరుణ్, ప్రముఖ ఊపిరితిత్తుల వైద్య నిపుణులు డాక్టర్ బాల భాస్కర్, జీర్ణకోశ వ్యాధి వైద్య నిపుణులు డాక్టర్ లోకేష్, జనరల్ మెడిసిన్ వైద్య నిపుణులు డాక్టర్ శుభ కట్ట వైద్య సేవలు అందిస్తారని వివరించారు. షుగర్ పరీక్ష, గుండె పరీక్షలు, ఊపిరి తిత్తుల సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. శిబిరానికి హాజరయ్యేవారు తమ పాత వైద్య రిపోర్టులను తీసుకురావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9700012398, 8886911511 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని సూచించారు.



నారా లోకేష్



నాదెండ్ల మనోహర్



కన్నా లక్ష్మీనారాయణ



పత్తిపాటి పుల్లారావు



ధూళిపాళ్ల నరేంద్రకుమార్



యరపతినేని శ్రీనివాసరావు



తెనాలి శ్రావణ్‌కుమార్



జూలకంటి బ్రహ్మానందరెడ్డి



నసీర్ అహ్మద్



డాక్టర్ చదలవాడ అరవిందబాబు



బూర్ల రామాంజనేయులు



భాష్యం ప్రవీణ్

శాసనసభ్యునిగా ఎన్నికైన ... అను నేను!

- గుంటూరు, పల్నాడు జిల్లాల నుండి ఎన్నికైన 13 మంది ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారం
- అనివార్య కారణాల వల్ల హాజరవని జీవీ ఆంజనేయులు - ప్రమాణం నేడు



గల్లా మాధవి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి ఇటీవల ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా ఎన్నికైన 14 మందిలో 13 మంది శుక్రవారం శాసనసభలో తొలి సారిగా అడుగుపెట్టారు. శాసనసభ్యుడిగా ఎన్నికయిన .... అనే నేను అంటూ 13 మంది ప్రమాణ స్వీకారం చేశారు. మంత్రులు నారా లోకేష్ (మంగళగిరి), నాదెండ్ల మనోహర్ (తెనాలి), సీనియర్ ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్రకుమార్ (పొన్నూరు), కన్నా లక్ష్మీనారాయణ (సత్తెనపల్లి), యరపతినేని శ్రీనివాసరావు (గురజాల), పత్తిపాటి పుల్లారావు (చిలకలూరిపేట), తెనాలి శ్రావణ్‌కుమార్ (తాడికొండ) ప్రమాణస్వీకారం చేశారు. తొలిసారిగా ఎన్నికయిన చదలవాడ అరవిందబాబు (నరసరావుపేట), భాష్యం ప్రవీణ్ (పెదకూరపాడు), జూలకంటి బ్రహ్మారెడ్డి (మాచర్ల), నశీర్ అహ్మద్ (గుంటూరు తూర్పు), గల్లా మాధవి (గుంటూరు పశ్చిమ), బి.రామాంజనేయులు (ప్రత్తిపాడు) ప్రమాణస్వీకారం చేసిన వారిలో ఉన్నారు. వినుకొండ నుంచి ఎన్నికైన జి.వి.ఆంజనేయులు ప్రమాణస్వీకారం చేయలేదు. అనివార్య కారణాల వల్ల వ్యక్తిగత పని ఉండటం వల్ల శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయలేకపోయారని ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. శనివారం ఆయన ప్రమాణ స్వీకారం చేస్తారని టిడిపి వర్గాలు తెలిపాయి.

వీరపనేని నగర్ వాసులకు న్యాయం చేయండి..

స్థలాల కబ్జాకు వైసిపి నేతలు యత్నిస్తున్నారని పేదల ఆందోళన - ఎమ్మెల్యే కలుగజేసుకోవాలని విన్నపం

ప్రజాశక్తి - వినుకొండ



హైకోర్టు సూచనల మేరకు మండలంలోని విఠంరాజుపల్లి గ్రామం వీరపనేని నగర్ వాసులు ప్రభుత్వం మంజూరు చేసిన నివేశన స్థలాల్లో లబ్ధిదారులు చేస్తున్న ఇంటి నిర్మాణ పనులను స్థానిక వైసిపి నాయకులు, రెవెన్యూ ఉద్యోగులు కొందరు బెదిరించి అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు జోక్యం చేసుకొని న్యాయం చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఇళ్ల స్థలాల పోరాట కమిటీ, గ్రామ సిపిఎం నాయకులు కె.హనుమంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మూడ్రోజులుగా లబ్ధిదారులు తమ స్థలాల్లో ఇంటి నిర్మాణం పనులు చేపడుతున్నారు. ఈ సందర్భంగా హనుమంత్‌రెడ్డి మాట్లాడుతూ 2003లో అప్పటి ఎమ్మెల్యే వీరపనేని ఎలమందరావు హయాంలో సుమారు 50 మందికి ఒక్కొక్కరి 3 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు అందజేశారని, లబ్ధిదారులు కంచర్ల సరిత, వేముల వెంకటేశ్వర్లు, కంచర్ల నాగేశ్వరమ్మ, సంద్రపాటి మేరమ్మ, ఎలగాల శేషయ్య, జాస్తి వీరాంజనేయులు, మురుగుల నాగరాజులతో పాటు 23 మంది రేకుల షెడ్డు, గుడిసెలు ఏర్పాటు చేసుకుని నివసిస్తున్నారని చెప్పారు. అయితే జగనన్న కాలనీ పేరుతో వైసిపి అనుకూలమైన వ్యక్తులకు సెంటున్నర ఇచ్చేందుకు 2020 జూన్ 21వ తేదీన స్థానిక వైసిపి నాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్ సునీల్ మరికొందరు కలిసి పేదల స్థలాలను ఆక్రమించేందుకు యత్నించారన్నారు. అప్పటి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడు అండదండలతో పేదల ఇళ్లను వైసిపి నాయకులు దౌర్జన్యంగా కూల్చివేసి నిర్మాణ సామగ్రి, కరెంటు మీటర్లు అక్రమంగా తీసుకువెళ్లారని చెప్పారు. దీనిపై అలధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో బాధితులు హైకోర్టును ఆశ్రయించగా ఆ స్థలాలు పేదలకు చెందినవేనని, అధికారులు జోక్యం చేసుకోరాదని హైకోర్టు ఆదేశించిందని వివరించారు. బాధితులు గతేడాది వారి స్థలాల్లో ఇల్లు కట్టుకునే ప్రయత్నం చేయగా వైసిపి నాయకులు దౌర్జన్యంగా అడ్డుకొని దాడికి యత్నించారని, దీంతో భయపడిన పేదలు పనులు ఆపేశారని తెలిపారు. అయితే గత ఐదు రోజులుగా పనులు ప్రారంభించారని, ఇప్పుడూ స్థానిక వైసిపి నాయకుల ఒత్తిడితో ఆర్ఐ శ్రీహరి, వీఆర్వో నాగరాజు లబ్ధిదారులను బెదిరిస్తున్నారని తెలిపారు. ఈ అన్యాయంపై ప్రస్తుత ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుకు విన్నవిస్తామని, ఆయన పేదలకు అండగా నిలిచి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జాస్తి లింగయ్య, శేషయ్య, ఎం.నాగరాజు, పూరిమావిళ్ల అంజమ్మ, చింతపల్లి కుమారి పాల్గొన్నారు.

ప్రజాశక్తి
గుంటూరు 5
శనివారం 22 జూన్ 2024

నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలి : ఎస్ఎఫ్ఐ



నిరసనలో ఎస్ఎఫ్ఐ నాయకులు విద్యార్థులు

ప్రజాశక్తి - తెనాలి

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోనే వైద్య విద్య ప్రవేశ పరీక్ష నిర్వహించుకునేందుకు చర్యలు తీసుకోవాలి ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి కూచిపూడి సుభాష్ డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష నిర్వహణపై వచ్చిన ఆరోపణల పై సమగ్ర విచారణ చేసి బాధ్యులను కఠినంగా శిక్షించాలని కోరుతూ శుక్రవారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో పట్టణ టు టౌన్ పోలీస్ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడుతూ నీట్ పరీక్ష నిర్వహిస్తున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని (ఎన్ టి ఏ) రద్దు చేసి, ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం వైద్య విద్య ప్రవేశ పరీక్షలు నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. నీట్ లో 68 మంది విద్యార్థులు మొదటి ర్యాంకు పొందటం, గ్రేస్ మార్కులు ఇంప్లిమెంటేషన్ చేయటం, బీహార్లో ప్రశ్నాపత్రం లీక్ కావటం వంటి విమర్శలు తారస్థాయికి చేరాయని, పరీక్ష నిర్వహణలో పారదర్శకత లోపించిందనడానికి ఇవన్నీ నిదర్శమన్నారు. నీట్ పరీక్షను వెంటనే రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వై. శశి కాంత్, కె. పవన్ మణికంఠ, ఎన్.భాను వెంకట సాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక ఓపీ

జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్


ట్రాన్స్ జెండర్స్‌తో కలిసి కేక్ కట్ చేస్తున్న సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సమాజంలో మంచి గుర్తింపు తెచ్చే విధంగా ట్రాన్స్ జెండర్స్ మసలుకోవాలని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రి నాట్కో లో ప్రైడ్ మంత్ లో భాగంగా వాలంటరీ హెల్త్ సర్వీసెస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యం లో శుక్రవారం ట్రాన్స్ జెండర్స్‌కు ఉచిత వైద్య సలహాలు ఇచ్చేందుకు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రి లో ట్రాన్స్ జెండర్స్ కు ప్రత్యేకమైన ఓపిని ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. సమాజంలో వారు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఓపిని కేటాయించామని ఆయన చెప్పారు. ఈ ఓపి లో వైద్యులు అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకున్నామని అయితే ఎవరు కూడా పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోలేక పోతున్నారని అయన విచారం వ్యక్తం చేసారు. ఇప్పటికైనా ఆసుపత్రి అందిస్తున్న సేవలను పొందాలని అయన కోరారు. వైద్యులను అందుబాటులో ఉంచడమే కాకుండా మంచి వాతావరణాన్ని కల్పించామని ఆయన చెప్పారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు తన దృష్టికి తీసుకుని వస్తే వెంటనే పరిష్కారించే విధంగా కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ ఆసుపత్రి ట్రాన్స్ జెండర్స్ కుఅండగా నిలబడుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా తయారు చేసిన కేక్ ను ట్రాన్స్ జెండర్స్ తో సూపరింటెండెంట్ కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, మానసిక విభాగం హెచ్ ఓ డి డాక్టర్ ఉమాజ్యోతి, ప్లాస్టిక్ సర్జరీ విభాగం హెచ్ ఓ డి డాక్టర్ సుమితా శంకర్, వి హెచ్ యస్ రీజినల్ కో ఆర్డినేటర్ బి అపర్ణ, డాక్టర్ చంద్రశేఖరన్, పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి


సదస్సులో మాట్లాడుతున్న దండా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-గుంటూరు

భవన నిర్మాణ కార్మిక సంఘం(సిఐటియు) పశ్చిమ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక గుజ్జనగుండ్లలోని సుందరయ్య భవన్‌లో భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు డి. కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, పెండింగ్ క్లైమ్స్ వెంటనే పరిష్కరించాలని కోరారు. గత ప్రభుత్వం కూడా నిర్మాణ కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ఇసుక, ఇతర ముడిసరుకుల ధరలు నియంత్రించి, నిర్మాణ కార్మికుల ఉపాధి మెరుగుదలకు కృషి చేయాలని, రాజధాని నిర్మాణంలో స్థానిక కార్మికులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. సదస్సులో సంఘం పశ్చిమ కమిటీ ప్రధాన కార్యదర్శి షేక్.ఖాసింవలి, సిఐటియు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.సత్యనారాయణ, బి.ముత్యాలరావు, ఎలక్ట్రికల్ యూనియన్ కార్యదర్శి సీతారామయ్య, నాయకులు భాషా ప్రసంగించారు. కార్యక్రమంలో గుజ్జనగుండ్ల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పి.రాము, సయ్యద్ మౌలాలి, జె.కోటేశ్వరరావు, ప్రభాకర్ పాల్గొన్నారు.


హోం మినిష్టర్ అనితను సత్కరిస్తున్న రాజధాని రైతులు రాజధాని రైతులు

అక్రమ కేసులు ఎత్తివేయాలని హోంమంత్రికి వినతి

ప్రజాశక్తి - తుళ్లూరు : రాజధాని రైతులు, మహిళలపై వైసిపి ప్రభుత్వం కక్ష పూరితంగా అక్రమ కేసులు పెట్టిందని, వాటిని ఎత్తివేయాలని రైతులు రాష్ట్ర హోం శాఖామంత్రి వంగలపూడి అనితకు విజ్ఞప్తి చేశారు. సచివాలయంలో రైతులు, మహిళా రైతులు అనితను కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని రైతులు,మహిళలు శాలువాలతో సత్కరించారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఆసుపత్రి లో ప్రతిరోజూ రోగులకు వైద్యులు అందుబాటులో ఉండాలని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ చెప్పారు. శక్రవారం శుశత హాలులో ఎస్ యన్ సి యు, చిన్న పిల్లల వైద్యుల తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగం వసరం అనుకున్నప్పుడు ప్రతిఒక్కరు బాద్యతః పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతిరోజూ వైద్యులను డ్రెస్ కోడె అమలు చేయాలనీ అనేకమార్లు మొరపెట్టుకున్నా పేద చెవిన పెడుతున్నారని అయన విచారం వ్యక్తం చేసారు. ప్రతిఒక్కరు సమయ వేళలను పాటించాలని అయన అన్నారు. ప్రభుత్వం లక్షలు జీతాలు చెల్లిస్తుందని బాధ్యత గా పని చేయాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో చిన్న పిల్లల వైద్యులు దేవా కుమార్, డాక్టర్ రమేష్, నవజాత శిశువు యూనిట్, చిన్న పిల్లల వైద్యులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న కేశవరెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్రంలో నూతనంగా అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగ, పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న డిఎ బకాయిలు, పిఆర్‌సి బకాయిలను వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పి.కేశవరెడ్డి కోరారు. శుక్రవారం స్థానిక నగరంపాలెంలోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెన్షనర్లకు బకాయిలు చెల్లింపుతోపాటు అడిషనల్ క్వాంటం పెన్షన్‌ను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగ, పెన్షనర్లకు, కుటుంబ పెన్షనర్లకు నెట్ వర్క్ ఆసుపత్రులలో నగదు రహిత వైద్య సేవలను కల్పించాలని, అదే విధంగా రైలు ప్రయాణంలో సీనియర్ సిటిజన్లకు గతంలో ఉండే విధంగా ప్రయాణ రాయితీ కల్పించాలని కోరారు.సమావేశంలో సంఘం కోశాధికారి సైదులు, కార్యదర్శి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు రామారావు, కార్య నిర్వాహక కార్యదర్శి మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

మృతి చెందిన వృద్ధురాలి నేత్రాలు దానం


నేత్రాలను సేకరిస్తున్న వైద్య సిబ్బంది


నేత్రదాత వెంకటరత్నం (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి పట్టణం లోని పాత మంగళగిరి చెందిన పట్టెం వెంకట రత్నం (85) శుక్రవారం అనా రోగ్యకారణంతో మృతి చెందారు. మృతు రాలికి ముగ్గురు కుమా రులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వెంకటరత్నం తాను మృతి చెందిన తరువాత తన నేత్రాలను మరొకరికి దానం చేయాలని ముందుగానే నిర్ణయించుకొని శంకర కంటి ఆసుపత్రి వారికి, వారి మేనల్లుడు, అల్లుడు, అయినా ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (ఏఐటీయూసీ) పిల్లలమర్రి నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు (సిఐటియు) పిల్లలమర్రి బాలకృష్ణ ద్వారా తెలియజేయడం జరిగింది. దీంతో శుక్రవారం శంకర కంటి ఆసుపత్రి సిబ్బంది నేత్రాలను తీసుకోవడం జరిగింది. నేత్రాలను దానం చేయడం పట్ల మృతురాలు కుటుంబ సభ్యులు, బంధువులు, వేరొకరికి చూపు కల్పించడంలో ఆమెను కొనియాడారు.



కాజ గ్రామ చరిత్ర పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ : కాజ గ్రామ లో జరిగిన సభలో "కాజ గ్రామ చరిత్ర శాసనాలు" అనే గ్రంథావిష్కరణ కార్యక్రమం శుక్రవారం జరిగినది. ఈ సభను పుస్తక సంపాదకులు సింహాద్రి వెంకట రామి రెడ్డి అధ్యక్షత వహించారు ఈమని శివనాగి రెడ్డి, మణిమేళ శివశంకర్ లు సంయుక్తంగా రచించిన "కాజ గ్రామ చరిత్ర శాసనాలు" గ్రంథాన్ని గుంటూరు జనవిజ్ఞాన వేదిక వి. లక్ష్మణరెడ్డి ఆవిష్కరించి ప్రసంగించారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ మోదుగుల రవికృష్ణ ప్రసంగిస్తూ ఈ గ్రామ చరిత్ర రాబోయే తరాలకు అందించే ఈ ప్రయత్నం ఎంతో గొప్పదని చెప్పారు. గ్రామ మాజీ సర్పంచి ఈదా నాగేంద్రారెడ్డి కాజ గ్రామానికి చెందిన పాత విషయాలను సభికులకు గుర్తు చేశారు. గ్రంథ సంపాద కులు, స్థానికులు సింహాద్రి వెంకట రామా రెడ్డి ప్రసంగిస్తూ గత 15 ఏళ్లుగా ఎన్నో చోట్ల సేకరించిన సమాచారాన్ని పుస్తకంగా తీసుకువచ్చిన శివనాగిరెడ్డి కృషిని అభినందించారు.



అంగన్వాడీల వేతనాలు పెంచాలి

ప్రజాశక్తి - చేబ్రోలు

ఇచ్చిన మాట ప్రకారం అంగన్వాడీల వేతనాలు పెంచాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు పొన్నూరు ప్రాజెక్టు కార్యదర్శి రత్న మంజుల ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం చేబ్రోలు లోని యూటీఎఫ్ కార్యాలయంలో అధ్యక్షులు సుమలత ఆధ్వర్యంలో అంగన్వాడి యూనియన్ మండల సమావేశం నిర్వహించడం జరిగింది. సమావేశంలో అంగన్వాడి వర్కర్ అండ్ హెల్పర్స్‌కు వేతనాలు పెంచాలనీ, అంగన్వాడీ సిబ్బంది పోరాటం చేస్తున్న సందర్భంలో అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న ఇప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం అంగన్వాడి సిబ్బందికి వేతనాలను పెంచాలని కోరారు. అదే విధంగా అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ ప్రభుత్వ ఉద్యోగులు అనే పేరుతో సంక్షేమ పథకాలు పొందటానికి ఆటంకంగా ఉన్న నిబంధనలు తొలగించాలని కోరారు. అంగన్వాడీలపై రాజకీయ వేధింపులు ఆపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ, నాయకులు మరియమ్మ, శోభ, రాధా రాణి తదితరులు పాల్గొన్నారు.



గారపాడులో 'బడికిపోతాం' ర్యాలీ

ప్రజాశక్తి-పెదకూరపాడు

మండలంలోని గారపాడు గ్రామంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల హైస్కూల్ విద్యార్థినీ విద్యార్థులతో శుక్రవారం 'బడికి పోతాం' పేరుతో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల వద్ద నుండి గ్రామ వీధుల్లో ఈ ర్యాలీ నిర్వహించారు. చదువు వయసు ఉన్న పిల్లలందరూ బడిలోకి చేర్పించడం ఈ ర్యాలీ ఉద్దేశమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివ నాగేశ్వరరావు తెలిపారు.



రిటర్నింగ్ ఆఫీసర్ శ్రీరాములును సన్మానిస్తున్న చిత్రం

ఆర్వోకు ఘన సన్మానం

ప్రజాశక్తి- పెదకూరపాడు

ఎన్నికలు ప్రశాంతంగా జరగటానికి సహకరించిన వారందరికీ ధన్యావాదాలు తెలుపుతున్నానని పెదకూరపాడు నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ శ్రీరాములు అన్నారు. శుక్రవారం ఎన్నికల సిబ్బంది, అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా జరగటానికి అన్ని శాఖల అధికారులు బాగా పనిచేశారని ఆర్వో కొనియాడారు. అనంతరం ఆర్వోను దుశ్శాలువాతో సన్మానించారు. అసిస్టెంట్ ఆర్వో ప్రభాకర్ రావు, సిబ్బంది వీఆర్వోలు పాల్గొన్నారు.



ఆహారం వడ్డిస్తున్న విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం సభ్యులు

విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం అన్నదానం

ప్రజాశక్తి-వినుకొండ

స్థానిక నరసరావుపేట రోడ్డులోని విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం భవన ఆవరణలో విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం ఆధ్వర్యంలో అవ్వారు రంగయ్య జ్ఞాపకార్థం వారి కుమారుడు అవ్వారు కోటేశ్వరరావు, కుమార్తె కృష్ణకుమారి చేతుల మీదుగా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భువనగిరి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గత పదేళ్లుగా విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం ఆధ్వర్యంలో చేస్తున్నటువంటి పలు సేవా కార్యక్రమాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో రామలింగేశ్వరరావు, కాళ్ళ కృష్ణమూర్తి, వైవి. సుబ్బయ్య శర్మ, గోపీచంద్, శర్మ , ఎస్ ఎస్ ఎం. శాస్త్రి, జి. నాగేంద్రుడు, సిహెచ్ సుబ్బారావు, రాఘవయ్య, సిహెచ్ వెంకటస్వామి, దీక్షితులు, శంకరరావు పాల్గొన్నారు.



యడ్లపాడు మండలంలోని లింగారావుపాలెం జడ్పీ హైస్కూల్లో ..



ఈపూరులో..

ఘనంగా యోగ దినోత్సవం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పదవ అంతర్జాతీయ యోగదినోత్సవం సందర్భంగా శుక్రవారం నరసరావుపేట మండలంలోని లింగంగుంట్ల లోని అమృత్ సరోవర్ చెరువు వద్ద మొక్కలు నాటి యోగా డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రాజెక్టు డైరెక్టర్ జోసఫ్‌కుమార్ హాజరయ్యారు. శంకర భారతీ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో యోగా చేయించి దాని ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రవికాంత్,ఎపిడి సుధాకర్, నాయకులు గంగుల పెద్దిరెడ్డి, యాదల మహానంద రెడ్డి, కొండలు,గోవిందు,శ్రీరాములు, పంచాయతికార్యదర్శి కెవి. శివప్రసాద్, సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి యోగా చేస్తున్న ఐగ్రో ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ పి.వెంకట్

నరసరావుపేట మండలంలోని కేసానుపల్లి గ్రామ పరిధిలోని మేదరమట్ల అంజమ్మ మస్తానరావు గ్రూప్ ఆఫ్ కాలేజెస్, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించామని కళాశాల చైర్మన్ ఎం ఆర్ శేషగిరిరావు తెలిపారు. యోగ శిక్షకురాలు ఆర్ లక్ష్మీ ప్రసన్న విద్యార్థులకు వివిధ రకాల యోగాసనాల ఉప యోగాలపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ యోగ అభ్యసిస్తూ రోగాలకు దూరంగా ఉండాలని సూచించారు. రామ శేషగిరిరావు మాట్లాడుతూ శ్వాస వ్యాయామంతో మానసిక ఒత్తిడిని, ఆందోళనను తగ్గించి నిరాశ, నిస్పృహల నుండి బయటకు తీసుకురావడానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఫార్మసి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం ప్రసాదరావు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ రామారావు, లా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కందుల వీర బ్రహ్మం పాల్గొన్నారు.

విద్యార్థులు మానసిక పునరుత్తేజానికి యోగ దోహదం చేస్తుందని ఐగ్రో ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ పల్ల బోతుల వెంకట్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సంద ర్భంగా నరసరావుపేట పట్టణ సమీపంలో చిలకలూరి పేట రోడ్డులోని ఈ పాఠశాలలో యోగా డే నిర్వహిం చారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి వెంకట్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటల్లో రాణించాలని సూచించారు. విద్యతో పాటు ఆట పాటలు, యోగా తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవా లన్నారు. ఒత్తిడి జయించడంతో పాటు లక్ష్య సాధనకు యోగ ఒక మంచి మార్గం అన్నారు. వైస్ చైర్మన్ పల్ల బోతుల మురళీ బాబు అమెరికా నుండి వర్చువల్ విధా నంలో మాట్లాడుతూ పల్నాడు ప్రాంతంలో అంతర్జా తీయ విద్యా ప్రమాణాలతో స్థాపించిన ఐగ్రో అంతర్జా తీయ పాఠశాలలో విద్యార్థులకు ఒత్తిడి విద్యను బోధిం చేందుకు ప్రాధాన్యత ఇస్తున్నా మన్నారు. అన్ని తరగతు లలో తమ విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధిం చడం పై విద్యార్థులకు, అధ్యాపకులకు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి విద్యార్థి బాగా చదువుకుని పాఠశాలకు తల్లిదండ్రులకు పల్నాడు ప్రాంతానికి పేరు ప్రఖ్యా తులు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సి పల్ డి.వెంకట శేషసాయి,వైస్ ప్రిన్సిపల్ వై.చంద్ర బాబు, ఎఒ ఎ.విశ్వనాథ్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక పెదనందిపాడు రోడ్డులోని సెయింట్ చార్లెస్ పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వ హించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ మేరీ విమల, పిఇటి సాతులూరి ఆనంద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీరామ్ శ్రీనివాస్ కల్యాణ్

ప్రజాశక్తి-మాచర్ల

యోగాను ప్రతిఒక్కరు అచరించటం ద్వారా చక్కటి ఆరోగ్యాన్ని అందిపుచ్చు కోవచ్చునని న్యాయమూర్తి శ్రీరామ్ శ్రీనివాస్ కల్యాణ్ అన్నారు. శుక్రవారం స్థానిక కోర్టు ఆవరణలో యోగా వేడుకలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా న్యాయ మూర్తి శ్రీరామ్ శ్రీనివాస్ కళ్యాణ్ మాట్లాడారు. కార్యక్రమంలో మండల సేవా కమిటీ సభ్యులు మెట్టు గోవింద రెడ్డి యోగా గురించి వివరించారు. పలు అసనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాది జి .వెంకటేశ్వర్లు, న్యాయవాది గౌస్ బాషా, కోర్టు సిబ్బంది, ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఈపూరు

స్థానిక జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులతో యోగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈపూరు జడ్పిహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు ఎన్ రామ కృష్ణారెడ్డి మాట్లాడారు. ముప్పాళ్ళ ధన లక్ష్మి వ్యాయామ కళాశాలలో విద్యార్థులచే యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో వ్యాయామ కళాశాల ప్రిన్సి పాల్ చుండు వెంకటరావు, జూనియర్ కళాశాల ప్రిన్సి పాల్ జి.నరసింహారావు, జడ్పీహెచ్ఎస్ పీడీ వీరాంజ నేయులు, ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-పెదకూరపాడు

స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో, గారపాడులోని జెడ్‌పి పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు యోగపై అవగాహన కల్పించారు. వారి చేత యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా గారపాడు జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయులు శివ నాగేశ్వర రావు, పెదకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట రమణ మాట్లాడారు.

ప్రజాశక్తి-యడ్లపాడు

మండలంలోని సొలసలో చెరువు ఒడ్డున యోగాసనాలు వేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అధికారులు, గ్రామపెద్దలు పథకం పాల్గొన్నారు. లింగారావుపాలెం జడ్పీ హైస్కూల్లో విద్యార్థులు యోగాసనాలు వేశారు.

ప్రజాశక్తి-వినుకొండ

స్థానిక ఎన్ఎస్పి కాలనీలోని సాయిబాబా గుడి ఆవరణలో సాయి పతంజలి యోగ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో యోగ డే క్లాసులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యోగ అసోసియేషన్ ప్రెసిడెంట్ కనిగండ్ల అనంత కోటేశ్వరరావు మాట్లాడుతూ గత 15 సంవత్సరాల నుండి ఈ ఆవరణలో యోగా నిర్వహిసున్నట్లు చెప్పారు. ప్రతిరోజు ఉదయం 6:30 నుండి సూర్య నమస్కారాలు ప్రారంభించి 7:30 వరకు యోగాసనాలు ప్రాణాయామం వేస్తున్నామని ప్రతి ఒక్కరూ వారి ఇంటి వద్ద యోగాసనాలు వేయవచ్చని చెప్పారు. కార్యక్రమంలో కొప్పు రావూరి. శ్రీనివాసరావు, రెడ్డి. నగేష్, కాకుమాను. రాముడు, నరాల శెట్టి. శ్రీనివాస్, పి. శ్రీనివాస రెడ్డి, ఎం. మల్లీ, బి.కృష్ణమూర్తి, బి. దుర్గారావు, కె. సీతారామయ్య, వెంకటేశ్వర్లు, జి. కోటేశ్వరరావు, రవి, ఆర్. రమేష్, కోటేశ్వర నాయక్, అమరనాథ్, పి. సురేష్ ,ప్రసాద్, సిహెచ్ .సురేష్, తదితరులు పాల్గొన్నారు.





చిలకలూరిపేటలోని సెయింట్ చార్లెస్ పాఠశాలలో,వినుకొండలో ఎన్ఎస్పి కాలనీలోని సాయిబాబా గుడి ఆవరణలో సాయి పతంజలి యోగ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



యూరాలజీ సమస్యలకు పరీక్షలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు అపోలో హాస్పటల్‌లో మూత్రనాళ సంబంధిత వ్యాధులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు యూరాలజిస్టు డాక్టర్ బి.సందీప్ తెలిపారు. స్థానిక కుందుల రోడ్‌లోని అపోలో క్లినిక్‌లో శుక్రవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడుతూ యూరాలజీ సమస్యలను త్వరగా గుర్తించి వీరికి సకాలంలో చికిత్సలు చేయించేందుకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. నైపుణ్యం కలిగిన నిపుణుల బృందంతో రోగనిర్ధారణ చేయడం ద్వారా ప్రాథమిక దశలోనే చికిత్సలు అందించి ఉపశమనం కల్గిస్తామన్నారు. తీవ్ర సమస్యలు వారికి చెన్నై అపోలో ఆస్పత్రికి పంపి శస్త్రచికిత్సలు చేయిస్తామని అన్నారు. గుంటూరు క్లినిక్‌నిర్వహాకులు గౌతమ్ పాల్గొన్నారు.





కాజలో వేడుకగా ఏరువాక పౌర్ణమి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఏరువాక పండుగను మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని కాజ రైతులు శుక్రవారం సాయంత్రం సంప్రదాయబద్ధంగా జరుపుకొన్నారు. కుల,వర్గ రహితంగా జ్యేష్ఠమాసం పౌర్ణమి రోజున ఏరువాక జరుపుకోవడం కాజలో ఆనవాయితీగా వస్తోంది. ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన ఈ ఊరివారు, ఆడపడుచులు ఏరువాక ఉత్సవాన్ని తిలకించేందుకు తరలివచ్చారు. ఏరువాక ఉత్సవంతో కాజలో కోలాహలం నెల కొంది. కాజలోని అగస్తేశ్వరస్వామి (శివాలయం) ఆలయ ప్రాంగణంలోని రత్నగర్భగణపతి ఆలయం విగ్రహం వద్దకు స్థానికులందరూ తరలివచ్చి పూజలు నిర్వహించారు. స్వామి వారికి మొదట నైవేద్యం పెట్టి ఆ ఉండ్రాళ్ల ప్రసాదాన్ని పెదకాపులు సింహాద్రి వెంకటరామారెడ్డి, కుక్కల కోటేశ్వరరావు, బొమ్ము పిచ్చిరెడ్డి, చెన్నం శ్రీనివాసరావులు స్వహస్తాలతో భక్తులకు పంపిణీ చేశారు. ఉండ్రాళ్ల ప్రసాదం కోసం భక్తులు పోటీపడ్డారు. ఇక్కడ విఘ్నేశ్వరుని గుడికి నాలుగువైపులా ఉన్న నాలుగు స్తంభాలు... ధర్మ, అర్థ, కామ, మోక్షాలకు ప్రతీకలని స్థానికుల విశ్వాసం. గ్రామపెద్దలు (పెద్దకాపులు) ఏరువాక పర్వదినాన ఈ స్తంభాలను అధిరోహించి ఉత్సవాన్ని తిలకించడానికి వచ్చిన భక్తులకు ప్రసాదాన్ని పంచిపెట్టారు. ప్రసాదాలు స్వీకరించిన వారికి బాధలు తొలగి అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని ఈ ప్రాంత వాసుల ప్రగాఢ నమ్మకం. ఏరువాక పౌర్ణమి సందర్భంగా వర్షపు జల్లులు కురవడంతో భక్తులు, రైతులు పులకించారు. విఘ్నేశ్వరుని సన్నిధిలో వృషభ పూజ జరిపి ట్రాక్టర్లు, నాగళ్లు, ఎడ్ల బండ్లు, వ్యవసాయ ఉపకరణాలు, అరకలు కట్టి పసుపు, కుంకుమలు రాసి గుడివద్దకు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏరువాక సాగారోరన్నో.. చిన్నన్నా అంటూ రైతులు ఉత్సాహభరిత వాతావరణంలో లాంఛనంగా దుక్కి దున్నారు. పంటలు బాగా పండాలని, అష్టైశ్వర్యాలు సిద్ధించాలని మొక్కుకున్నారు. ఆలయ ప్రాంగణంలో కాజ రైతు మారెళ్ల సత్యమారెడ్డి, పొంగలి, చక్రపొంగలి, పులిహోర ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఏరువాక ఉత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి విఘ్నేశ్వరుని సన్నిధిలో పూజలు నిర్వహించారు. ఏరువాక పౌర్ణమి ఉత్సవాన్ని తిలకించేందుకు మంగళగిరి, కాజ సమీప గ్రామాల ప్రజలు కూడా తరలివచ్చారు. ఏరువాక పండుగను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించారు. 90 అడుగుల ఎత్తైన విద్యుత్ లైట్ల ప్రభ భక్తులను విశేషంగా ఆకర్షించింది. కాజలోని కోలాట బందం, బాలల సంఘం, ప్రజాసాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహించాయి. కాజలో ఏరువాక ఉత్సవం తిరునాళ్లను తలపించింది.




పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్

పారిశుధ్య పనులను పరిశీలించిన కమిషనర్

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని ఐదవ సచివాలయ పరిధిలోని అన్ని ప్రాంతాలను శుక్రవారం మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ వి నిర్మల కుమార్ పారిశుధ్య పనులను పరిశీలించారు. పారిశుధ్య పనులను ప్రతిరోజూ క్రమం తప్పకుండా చేయాలనీ, ప్రజలకు ఎటువంటి అసౌకర్యము ఏర్పడకుండా రోడ్లను, వీధులను మరియు డ్రెయిన్ లను పరిశుభ్రముగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్లపై ఎటువంటి ఆక్రమణలు జరుగకుండా ప్లానింగ్ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాలని, రోడ్లపై అనధికారముగా ఎటువంటి తాత్కాలిక నిర్మాణములు, ఇసుక, కంకర, ఇటుక మరియు డెబ్రిస్‌లను రోడ్డు పై వేయకుండా, రోడ్లపై అక్రమముగా తోపుడు బండ్లు, బడ్డీ కొట్లు వంటి వాటిని ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు.అన్ని సచివాలయముల అడ్మిన్ కార్యదర్శులు తమ తమ పరిధిలో ఉన్న ఖాళీ స్థలములను గుర్తించి జంగిల్ క్లియరెన్స్ చేయించుకొని పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ఆయా యజమానులకు తెలియ పరచాలని ఆయన ఆదేశించారు. ఎమినిటీ సెక్రటరీ లు తమ తమ వార్డులలో తరచూ పర్యటిస్తూ ప్రతి రోజూ క్లోరిన్ టెస్ట్ లు నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలని తద్వారా మంచి నీటి సరఫరా పై ప్రత్యేక దృష్టి సారించాలని తెలియ చేశారు.

డిజిపికి అభినందనలు



ప్రజాశక్తి - తుళ్లూరు : డిజిపి ద్వారకా తిరుమలరావును తుళ్లూరు ఎడ్యుకేషనల్ సొసైటీ కరస్పాండెంట్ జొన్నలగడ్డ శంకరరావు శుక్రవారం కలిసి అభినందనలు తెలిపారు. శంకరరావుతో పాటు సొసైటీ సభ్యులు జె నాగ మల్లేశ్వరరావు, రామ్మోహనరావు డిజిపి కి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న మండల అధ్యక్షులు ఎర్రు వెంకయ్య నాయుడు

నేడు కొల్లిపరలో మంత్రి మనోహర్ పర్యటన

విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయాలని టిడిపి మండలాధ్యక్షుని పిలుపు

ప్రజాశక్తి-కొల్లిపర

తెనాలి నియోజకవర్గ శాసనసభ్యులుగా గెలుపొంది, పౌర సరఫరాల శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి శని వారం తొలిసారి కొల్లిపర మండలంలో జరుగుతున్న కార్య క్రమాలకు హాజరవుతున్న పౌరసరఫరాల శాఖ మాత్యులు నాదెండ్ల మనోహర్‌కు ఘన స్వాగతం పలకాలని జనసేన మండల పార్టీ అధ్యక్షులు ఎవరు వెంకయ్య నాయుడు పిలు పునిచ్చారు. శుక్రవారం కొల్లిపర మండల పార్టీ కార్యాల యం లో వెంకయ్య నాయుడు కార్యకర్తలతో సమావేశం అయ్యారు ఈ విజయోత్సవ ర్యాలీ నందివెలుగు నుంచి ప్రారంభమై అత్తోట శివలూరు దావులూరు అడ్డ రోడ్డు మీదగా మండల కేంద్రమైన కొల్లిపర చేరుతుంది కావున ఈ ర్యాలీలో జనసేన తెదేపా బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ర్యాలీ అనంతరం మండల పరిషత్ కార్యా లయంలో ఆయా శాఖల అధికారులతో సమీక్ష సమా వేశం నిర్వహిస్తారన్నారు. తదానంతరం ఆయా పార్టీల నాయకులు కార్యకర్తలతో భేటీ అవుతారని ఆయన తెలిపారు. కార్య క్రమంలో జనసేన నాయకులు, భీమవరం వేణుగోపాల్ రెడ్డి భీమవరం కిషోర్ రెడ్డి జిల్లా కార్యదర్శి తెరికల్ రాంబాబు కట్టా శ్రీహరి సుబ్బారెడ్డి షేక్ బాజీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

శారీరక, మానసిక దృఢత్వానికి యోగా సాధనం : జేసీ

జిల్లాలో ఘనంగా యోగా దినోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు

ఆరోగ్యంగా, ఆనందంగా ఉండటమే కాకుండా శారీరక, మానసిక ధడత్వానికి యోగా ఒక మంచి సాధనమని సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. శుక్రువారం స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియంలో ఆయుష్ శాఖ ఏర్పాటు చేసిన 10వ అంతర్జాతీయ యోగా డే కార్యక్రమంలో జేసీ రాజకుమారి, ఆర్‌డిఒ పి.శ్రీకర్, డిఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మీ, జిఎంసి అదనపు కమిషనర్ రాజేశ్వరి, నగర డిప్యూటీ మేయర్ షేక్.సజీల పాల్గొన్నారు. ఈ యోగా కార్యక్రమంలో జిల్లా అధికారులు, స్థానిక నర్సింగ్ విద్యార్థులు, వివిధ కాలేజీల విద్యార్థులు, యోగా ట్రైనర్‌లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా యోగా కోచ్ సాంబశివరావు హాజరైన వారితో యోగాసనాలు సాధన చేయించారు. ఈ సందర్భంగా జేసీ మీడియాతో మాట్లాడుతూ ప్రాచీన కాలం నుండి దేశంలో యోగా సాధన ఆచరించడం జరుగుతుందని, భారత దేశం పెట్టిన ప్రతిపాదన మేరకు ఐక్య రాజ్యసమితిలో ఆమోదించబడి 2015 జూన్ 21వ తేదీ నుండి అంతర్జాతీయ యోగా డే ను నిర్వహించుకుంటునట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయూష్ శాఖ సీనియర్ మెడికల్ అధికారిణి డాక్టర్ స్వర్ణ కుమారి, మెడికల్ అధికారులు డాక్టర్ వాసు చంద్రిక, డాక్టర్ శోభ రాణి వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్ :యోగ యొక్క విశిష్టతను తెలియజేయడానికే ఏర్పాటు చేయబడ్డ 'ప్రపంచ యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఎంటిఎంసీ పరిధిలోని కుంచనపల్లి లో'అరవింద స్కూల్ లో ఘనంగా నిర్వహించారు. స్పిక్ మాకే వారి ఆన్లైన్ క్లాసుల ద్వారా ప్రముఖ యోగ గురువులు డాక్టర్.మంజు ఝా ఆద్వర్యంలో ఐదు రోజుల పాటు సాధన జరిగింది. అలానే అరవింద పాఠశాలలోని విద్యార్థులందరికీ యోగా పట్ల అవగాహన కొరకు వ్యాయామ ఉపాధ్యాయులు ప్రత్యేకమైన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యావేత్త శివరాం మాట్లాడుతూ ప్రతి క్షణం ఎరుకలో ఉండటం కూడా యోగానే అని అన్నారు. అదేవిధంగా ప్రపంచ సంగీత దినోత్సవాన్ని కూడా పురస్కరించుకొని పాఠశాల సంగీత ఉపాధ్యాయులు శ్రీ ఎమ్.సురేంద్ర సంగీతం యొక్క విశిష్టతను తెలియజేస్తూ పిల్లలతో కొన్ని స్వరాలను పలికించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో యోగా దినోత్సవాన్ని ఎన్ సిసి 10 ఆంధ్రా బెటాలియన్ అద్వర్యంలో ఘనంగా



ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో

నిర్వహించారు. ఈ సందర్భంగా కెఎల్ వర్శిటీలోని ఓపెన్ ఎయిర్ థియేటర్ ప్రాంగణంలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ యోగా శిక్షకురాలు ఆర్ట్ ఆఫ్ లివింగ్ తరుపున సుమ హాజరయి యోగా పైన ఎన్ సిసి క్యాడెట్లకు శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో క్యాంప్ కమాండెంట్ కల్నల్ సిఎస్ సిద్ధు, డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ ఎస్‌విఎస్ సుదర్శన్, కెఎల్ యు వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్థసారదివర్మ, ప్రో విసిలు డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఎఎన్‌యు :ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ క్రీడా ప్రాంగణమునందు డిపార్ట్మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, యూనివర్సిటీ వ్యాయామ కళాశాల, హెచ్ సి ఎల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. యోగ ప్రోటోకాల్ నిర్వహణలో ముఖ్యఅతిథిగా ఫిజికల్ ఎడుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ పిపిఎస్ పాల్ కుమార్, హెచ్ సి ఎల్ ఫౌండేషన్, స్పోర్ట్స్ ఫర్ చేంజ్ కి చెందిన నందగోపాల్, యోగా కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ దాసరి సూర్యనారాయన, రాధిక యోగ ప్రొఫెసర్ సత్యమూర్తి లు ప్రారంభ వేడుకలో పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్ : ఆత్మకూరు పరిధిలోని నిర్మల ఫార్మసీ కళాశాలలో జాతీయ సేవా పథకం మరియు వివేకానంద కేంద్రము సంయుక్త ఆధ్వర్యంలో "యోగ ఫర్ సెల్ఫ్ అండ్ సొసైటీ" అను నేపథ్యంతో జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లెఫ్టినెంట్ ఎం మాధవరావు, రిటైర్డ్ హెచ్ ఓ డి ఆఫ్ ఎకనామిక్స్ ఎస్ ఆర్ ఆర్ కాలేజ్ మరియు వివేకానంద కేంద్రం నగర కార్యకర్త సాంబయ్య, విజయవాడ వివేకానంద కేంద్రము నగర సంయోజక్ శివ నందూరి యోగ యొక్క ప్రాముఖ్య తను, వివిధ ఆసనాల ప్రాముఖ్యతను తెలియజేశారు.

ప్రజాశక్తి - చేబ్రోలు :యోగా దినోత్సవ వేడుకలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నారాకోడూరు లో ఘనంగా జరిగాయి.యోగ మానసిక ప్రశాంతం ఇవ్వడమే కాకుండా సాధనతో ఏకాగ్రతను పెంచుతుందని వేడుకలలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న మండల విద్యాశాఖ అధికారి - 1 ఏ వి హెచ్ ప్రసాద్ విద్యార్థులతో మాట్లాడారు.

ప్రజాశక్తి - కొల్లిపర :విద్యార్థులు ప్రతిరోజు యోగాసనాలు వేయటం వలన ఆరోగ్యం సమకూరటమే కాక చురుకుగా మెలుగుతారని మండలంలోని తూములూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయ రత్న రాణి అన్నారు పాఠశాలలో విద్యార్థులకు యోగాసనాల ఉపయోగం గురించి మరియు యోగాసనాలు నేర్పించారు.

ప్రజాశక్తి-తెనాలి :ప్రపంచ యోగా దినోత్సవాన్ని స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మసి కళాశాల్లో శుక్రవారం నిర్వహించారు. హార్ట్‌ఫుల్ నెస్ సంస్థ యోగా శిక్షకులు ఎంఆర్‌కె మూర్తి, ఎం.శ్రీనివాసరావు విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటరమణ, ఎన్ఎస్ఎస్ అధికారి కల్యాణ చక్రవర్తి, ఐపిఎస్ఎఫ్ మెంటార్స్ వై.ఫణికృష్ణ, పి.భార్గవి, అధ్యాపక బృందం పాల్గొన్నారు. స్థానిక బోస్ రోడ్డులోని నెహ్రూ నికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు.

ప్రజాశక్తి-తాడేపల్లి :అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా తాడేపల్లి కృష్ణా కెనాల్ ఎఫ్‌సిఐ కార్యాలయంలో ఎఫ్‌సిఐ మేనేజర్ ధనుంజయ వర్గిస్ ఘనంగా యోగా డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగసనాల ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని సూచించారు. మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజల చెంతకు ఆరోగ్యం దరి చేరాలంటే యోగా ఒక్కటే మార్గమన్నారు. కార్యక్రమంలో మేనేజర్ శశికళ, యోగ ఉపాధ్యాయులు వెంకట్ తదితరులు పాల్గొన్నారు. పెనుమాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో యోగా టీచర్ బాలమురళీకృష్ణ, పీడీ రమేష్, హరికృష్ణ పాల్గొన్నారు. తాడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో యోగా డే నిర్వహించారు.



కేక్ కట్ చేస్తున్న తులసి రామచంద్రప్రభు

ఘనంగా తులసి రామచంద్ర ప్రభు, కృష్ణ చైతన్య జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రముఖ పారిశ్రామికవేత్త తులసి రామచంద్ర ప్రభు, ఆయన కుమారుడు తులసి కృష్ణచైతన్య జన్మదిన వేడుకలు శుక్రవారం రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తలు, అభిమానుల సమక్షంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక అరండల్ పేటలోని యోగి భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తమ కుమారులు తులసి యోగిష్, తులసి కృష్ణచైతన్య, మనవడు తులసి ఆదిత్య సమక్షంలో భారీ కేకును రామచంద్ర ప్రభు కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రభుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పూలదండలు, పుష్పగుచ్ఛాలతో, దుశ్శాలువాలతో సత్కరించారు. భవిష్యత్తులో తులసి గ్రూప్ సంస్థలు మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ప్రముఖులు డాక్టర్ మద్దినేని గోపాలకృష్ణయ్య, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్, వ్యాపారవేత్త మలిశెట్టి సుబ్బారావు, సుప్రీమ్ సర్జికల్స్ జవహర్ ప్రభుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రామచంద్రప్రభు మాట్లాడుతూ ఆత్మీయుల సమక్షంలో జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఆనందదాయకంగా ఉందని, పేదల అభ్యున్నతికి తులసి సంస్థలు బాసటగా నిలుస్తాయన్నారు. అనంతరం అరండల్ పేటలోని తులసి సంస్థల కార్యాలయంలో సంస్థ ఉద్యోగులు, తులసి అభిమానుల సమక్షంలో తులసి రామచంద్ర ప్రభు, తులసి కృష్ణ చైతన్య జన్మదిన వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఉద్యోగుల ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పోతురాజు సమత, యర్రంశెట్టి పద్మావతి, దాసరి లక్ష్మి దుర్గ, వాసు, మాదా రాధ, తోటకూర సుబ్బారావు, మలిశెట్టి సుబ్బారావు, దళవాయి సుబ్రహ్మణ్యం, ఉగ్గిరాల సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత నీటి సరఫరాకు చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో పట్టణాల్లో, గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు సురక్షితమైన మంచినీరు సక్రమంగా సరఫరా చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు యం.టి.కష్ణ బాబు, అనిల్‌కుమార్ సింఘాల్, ముఖ్య కార్యదర్శులు శశిభూషణ్‌కుమార్‌తో కలసి సీజనల్, డయేరియా వ్యాదులు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ నుండి పాల్గొన్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థలో గత అనుభవాలు దష్ట్యా మంచినీటి పైపులైన్లు లీకేజీలు లేకుండా నిరంతరం మున్సిపల్ అధికారులు పర్యవేక్షించటం జరుగుతుందన్నారు. వాటర్ ట్యాంకులను సైతం నిర్దేశిత సమయానికి ఖచ్చితంగా శుభ్రపరుచటం జరుగుతుందని, సరఫరా చేసే నీటికి అన్ని దశలలో పరీక్షలు నిర్వహించటం జరుగుతుందన్నారు. వీడియోకాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ వైద్యారోగ్యశాఖ, మున్సిపల్, పంచాయితీ, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారలతో మాట్లాడుతూ జిల్లాలో సీజనల్, డయేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా పట్టణాల్లో, గ్రామల్లో మంచినీటి సరఫరా సక్రమంగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ బాధ్యతగా చర్యలు తీసుకోవాలన్నారు. సరఫరా చేస్తున్న నీటిని సోర్స్ వద్ద, కుళాయిలవద్ద, టైల్ ఎండ్ వద్ద శాంపిల్స్ తీసి వైద్యారోగ్యశాఖ, మున్సిపల్, పంచాయితీ అధికారులు సమన్వయంతో పరీక్షలు నిర్వహించాలన్నారు. నిర్దేశించిన విధంగా ఫలితాలు లేకపోతే వెంటనే సంబంధిత సోర్స్‌ను నిలిపివేసి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పైపులైన్లకు లీకేజీలు ఎర్పడితే వెంటనే మరమ్మతులు చేయాలని, క్లోరినేషన్ సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రస్తుతం సమయంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున వైద్యారోగ్య శాఖ తో పాటు పంచాయితీ, మున్సిపల్ అధికారులు అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు పకడ్బందీగా చేపట్టాలన్నారు. ముందస్తు జాగ్రత్త చర్యలపై విద్యాశాఖ ద్వారా విద్యాసంస్థల్లోను, మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా అంగన్ వాడీ కేంద్రాలలో అవగాహన కల్పించాలన్నారు. ఇంటింటికి వైద్యారోగ్యశాఖ, స్థానిక సంస్థల అధికారులు కరపత్రాలు ఇతర మాధ్యమాల ద్వారా విస్తతస్థాయిలో ప్రచారం కల్పించాలన్నారు. సమావేశంలో డిఎంహెచ్ఒ డాక్టర్ విజయలక్ష్మి, డిపిఒ శ్రీదేవి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ సురేష్, జిఎంసి అదనపు కమిషనర్ లక్ష్మీరాజ్యం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

విద్యాలయాల్లో విస్తృతంగా అంతర్జాతీయ యోగా డే



విజ్ఞాన్ యూనివర్సిటీలో..

చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 10వ ఇంటర్నేషనల్ యోగా డేను ఈ సంవత్సరం 'యోగా ఫర్ ఉమెన్ ఎంపవర్‌మెంట్' అనే ఇతివృత్తంతో నిర్వహించారు. యోగా డేను పురస్కరించుకుని నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏపీలోని భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ వైస్ ప్రెసిడెంట్ డీ.దుర్గారావ్ ప్రసంగించారు. కార్యక్రమంలో ఏపీ హైకోర్టు అడ్వకేట్ జీవీఆర్ క్రిష్ణప్రసాద్, పారిశ్రామికవేత్త వీఆర్ శ్రీలక్ష్మి, విజయవాడలోని యోగాసన స్పోర్ట్స్ స్టేట్ సెక్రటరీ పీ.ప్రేమ్ కుమార్, వీసీ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ పాల్గొన్నారు.



ఆర్‌విఆర్ అండ్ జెసి కాలేజీలో..

ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజిలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. యోగా గురువులు సిహెచ్.జగదీశ్, డి.మధురిక విద్యార్థులకు, అధ్యాపకులకు యోగా ఆవశ్యకతను, ప్రయోజనాలను వివరించి, యోగా సాధన చేయించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



భాష్యం విద్యా సంస్థల్లో..

స్థానిక భాష్యం మెయిన్ క్యాంపస్‌లో విద్యార్థులకు యోగా డే సందర్భంగా యోగాసానలు సాధన చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణకిషోర్ మాట్లాడుతూ ఒత్తిడిని తగ్గించంటంలో యోగా ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



కెఎల్‌పి స్కూల్లో..

స్థానిక జెకెసి కాలేజి రోడ్డులోని డాక్టర్ కెఎల్‌పి స్కూల్లో యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ పాల్గొని యోగా ప్రాధాన్యతను, ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై.రధినిచౌదరి, పాఠశాల ఏఒ కె.వెంకటరావు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు యోగాసనాలు సాధన చేశారు.



సెయిన్ ఆన్స్ మహిళా కాలేజీలో..

స్థానిక గోరంట్లలోని ఫిజికల్ ఎడ్యుకేషన్, ఎన్‌సిసి, ఎన్‌ఎస్‌ఎస్ విభాగాల ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ యోగా డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ రెవరెండ్ డాక్టర్ సిస్టర్ ఫాతిమారాణి.పి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా జెకెసి కాలేజి ఫిజిక్స్ అధ్యాపకులు జి.సుభాష చంద్రబోస్ పాల్గొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బిహెచ్ కాలేజీలో..

స్థానిక బ్రాడీపేటలోని బిహెచ్ కాలేజిలో అంతర్జాతీయ యోగా డే నిర్వహించారు. నిధివనం వ్యవస్థాపకులు బొల్లాప్రగడ శ్రీదేవి ఆధ్వర్యంలో యోగా శిక్షకురాలు లక్ష్మీ విద్యార్థినులతో యోగాసనాలు చేయించారు. కార్యక్రమంలో నేచురోపతి డాక్టర్ రాఘవి, కళాశాల అధ్యక్షులు డాక్టర్ బి.వి.కౌసల్యాదేవి, వైస్ ప్రిన్సిపాల్ రాధా మాధవి పాల్గొన్నారు.





టిజెపిఎస్ కాలేజీలో..

స్థానిక పట్టాభిపురంలోని టిజెపియస్ కళాశాలలో ప్రపంచ యోగ డే నిర్వహించారు. ప్రముఖ యోగా గురువు డాక్టర్. కె.కొండయ్య ద్వారా విద్యార్థులకు 'నిత్య జీవితం లో యోగ పాత్ర' అనే అంశంపై అవగాహనా సదస్సు నిర్వహించినట్లు కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ కె.వి.బ్రహ్మం తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో యోగాసనాలు సాధన చేయించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎ.భాను మురళి, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి డాక్టర్.జె.వి.సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.



హిందూ కాలేజీలో..

స్థానిక హిందూ కాలేజిలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పిఎం.ప్రసాద్ యోగా ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం యోగా శిబిరంలో విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు యోగాసనాలు సాధన చేశారు. కార్యక్రమంలో జిల్లా యోగాసన క్రీడల కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ కెవిఎస్.దుర్గాప్రసాద్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారి రాము, సిబిసి అధికారులు సిహెచ్.కోటేశ్వరరావు, డి.సత్యశివప్రాద పాల్గొన్నారు.



కళ్లం కాలేజీలో..

చౌడవరంలోని కళ్లం ఇంజినీరింగ్ కాలేజిలో యోగాడే సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు యోగాసనాలు సాధన చేశారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి యోగా ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బిఎస్‌బి రెడ్డి, ఇసిఇ హెచ్‌ఒడి డాక్టర్ ఎస్.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



అభ్యుదయ కాలేజీలో..

స్థానిక లక్ష్మీపురంలోని అభ్యుదయ మహిళా కాలేజిలో అంతర్జాతీయ యోగా డే సందర్భంగా యోగాసనాలు, మెడిటేషన్ కార్యక్రమం నిర్వహించారు. యోగా శిక్షకులు శైలజ, శివానీ, మాధవి, శ్రీవాణి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. యోగా ప్రాముఖ్యతపై వక్తృత్వ పోటీఉలు నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బిఎస్ఆర్‌కె ప్రసాద్, బి.రోహిణీదేవి పాల్గొన్నారు.



చలపతి కాలేజీలో..

చలపతి ఇంజినీరింగ్ కాలేజిలో అంతార్జాతీయ యోగా డే నిర్వహించారు. ప్రముఖ యోగా గురువు కేశవ విశ్వకర్మ పాల్గొని యోగా ప్రాధాన్యత వివరించారు. విద్యార్థులతో యోగాసనాలు సాధన చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ యం.చంద్రశేఖర్, మానవీయ శాఖాధిపతి డాక్టర్ రాధాకృష్ణమూర్తి, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.